

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విశాఖపట్నానికి చెందిన పి.రాధాకృష్ణ కుటుంబం రూ.1,00,011 విరాళం ఇచ్చారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్:తెనాలి మార్కెట్ యార్డులో శని వారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.6,500, మోడల్ ధర రూ.5,000 వరకు పలికింది.



కార్తికేయుని సన్నిధిలో హైకోర్టు జడ్జి

మోపిదేవి: కృష్ణా జిల్లా మోపిదేవిలోని వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి నక్తి సుబ్బారెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
గుంటూరు	6:27	4:40
నరసరావుపేట	6:29	4:37
బాపట్ల	6:27	4:40

న్యూస్‌రీల్

10 వరకు ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశాలకు అవకాశం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం కింద పేదలకు ప్రైవేటు పాఠశాలల్లో కేటాయించిన 25 శాతం సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువు ఈనెల 10న ముగియనుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు అవకాశం ఉందని చెప్పారు. ఆన్‌లైన్‌లో సీసీఈ.ఛిట్ఛ్స.ఇజౌ౦.జీ౩/ఖఛీఉ వెబ్‌సైట్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు డీఈఓ, ఎంఈఓ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు. అదనపు సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 14417, ఇండస్ యాక్షన్ హెల్ప్‌లైన్ నంబర్ 9502666864లో సంప్రదించాలని సూచించారు.

ఎన్‌సీసీ యూనిట్ పరిశీలన

చీరాల టౌన్: వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలోని 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్‌ను గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. ఈనెల 13న ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ గుర్బీర్ పాల్ సింగ్ పర్యటనను పురస్కరించుకుని చేయాల్సిన ఏర్పాట్లపై బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్‌తో చర్చించారు. అనంతరం కళాశాల్లోని ఎన్‌సీసీ యూనిట్‌కు సంబంధించిన రికార్డులు, ఫైరింగ్ రేంజ్, క్యాడెట్ల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల సుబేదార్ మేజర్ కృష్ణన్‌కుమార్, సుబేదార్ లక్ష్మణ్‌సింగ్, కళాశాల ఎన్‌సీసీ అధికారి రాజేష్‌బాబు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు..

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 528.30 అడుగుల వద్ద ఉంది. ఇది 164.8476 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,160 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీకి 1,350, వరద కాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లోగా 5,830 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 5,830 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. నీటిమట్టం 805.40 అడుగుల వద్ద ఉంది. ఇది 31.7330 టీఎంసీలకు సమానం.

11న బైజూస్ కంటెంట్‌పై ఆన్‌లైన్ శిక్షణ

యడ్లపాడు: ఉమ్మడి జిల్లా విద్యాశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో బైజూస్ కంటెంట్ బోధించే అంశాలపై ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ ఈనెల 11వ తేదీ నుంచి ఇవ్వనున్నట్లు జిల్లా డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 57 మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి ట్యాబ్‌ల ద్వారా బోధించే 5,356 మంది ఉపాధ్యాయులు వెబ్‌ఎక్స్ శిక్షణలో భాగస్వామ్యం కావాలని కోరారు. 5 బృందాలుగా విభజించి వేర్వేరు సమయాల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి స్లాట్‌లోనూ డైట్ అధ్యాపకులు వంద మంది ఉపాధ్యాయులకు ఏకకాలంలో ఆన్‌లైన్ ద్వారా సమగ్ర శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ట్యాబ్‌లు పొందిన ఉపాధ్యాయులు అందరూ విధిగా లింక్‌ను ఓపెన్‌చేసి శిక్షణ తీసుకోవాల్సిందిగా సూచించారు. ఉపాధ్యాయులకు ఏఏ స్లాట్ శిక్షణ సమయాలకు వివరాలను సంబంధిత డీవైఈఓ, ఎంఈఓలకు ఆయా వివరాలను పంపించామని తెలిపారు. లింక్‌ను బైజూస్ నోడల్ ఆఫీసర్ ద్వారా పొందాలని కోరారు.

రేంజ్ ఐజీగా పాలరాజ్

- విశాఖ కమిషనర్‌గా త్రివిక్రమవర్మ
- మూడేళ్లపాటు సమర్థంగా బాధ్యతల నిర్వహణ
- ఇక్కడ పనిచేసిన అనుభవం మరిచిపోలేను: వర్మ
- విజిలెన్స్ ఎస్పీ మాధవరెడ్డికి పదోన్నతి



సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు రేంజ్ ఐజీగా జి.పాల రాజ్ నియమితులయ్యారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ జీవో విడుదల చేశారు. ఆయన ప్రస్తుతం ఏలూరు రేంజ్ డీఐజీగా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన పరిపాలనా పరంగా తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రధానంగా రేంజ్ పరిధిలోని అమలాపురంలో చోటుచేసుకున్న ఘర్షణను అదుపులోకి తెచ్చి శాంతి భద్రతల పరిరక్షణించడం, ఎమ్మెల్యేపై దాడి ఘటనపై సీరియస్‌గా వ్యవహరించడం, అలాగే ప్రధానమంత్రి భీమవరం పర్యటన విజయవంతం అయ్యేలా చూశారు. గంజాయి అక్రమ రవాణాపై దృష్టి పెట్టారు. పోక్సోతో పాటు కీలక కేసుల్లో వెంటనే శిక్షపడేలా చర్యలు తీసుకున్నారు. శాఖాపరంగా అవినీతిపై ఉక్కుపాదం మోపారు. సిబ్బందిపై ఫిర్యాదు వస్తే వెంటనే విచారించి చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది పదవి కాలంలో దాదాపు 17 మంది ఎస్ఐలు, సీఐలను వీఆర్, సస్పెండ్ వేటు వేశారు. నూతన ఐజీ పాలరాజ్ సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉందని కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

విశాఖ సీపీగా త్రివిక్రమవర్మ



రేంజ్ డీఐజీగా పనిచేసిన డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మను విశాఖ సిటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. 2005 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన త్రివిక్రమ వర్మ 2020 అక్టోబర్ 19న గుంటూరు రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు మూడేళ్లపాటు విధులు నిర్వర్తించిన ఆయన తనదైన ముద్ర వేశారు. 2021 గుంటూరు నగరంలోని పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బీటెక్ విద్యార్థిని రమ్య దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ హత్యకు పాల్పడిన యువకుడ్ని గంటల వ్యవధిలోనే పట్టుకున్నారు. ఈ కేసులో చార్జ్‌షీట్‌ను దాఖలు చేయడంలో పోలీసులు సఫలీకృతులయ్యారు. ఈ క్రమంలో హంతకుడికి గుంటూరు కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక కార్యచరణ అమలు చేశారు. రాత్రి వేళల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా జిల్లాలో ప్రమాదాలు కొంత వరకు తగ్గాయని చెప్పవచ్చు. పోలీస్ అధికార/ సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. 2023 జనవరిలో డీఐజీ నుంచి ఐజీగా ఉద్యోగోన్నతి పొందారు. గుంటూరు జిల్లాలో పని చేసిన కాలం తన కెరీర్‌లో మర్చిపోలేనిదని ఆయన వ్యాఖ్యానించారు.

సత్యసాయి జిల్లా ఎస్పీగా మాధవరెడ్డి



గుంటూరు జిల్లా ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి, సత్యసాయి జిల్లా ఎస్పీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన 2021 ఆగస్టు 25న బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన ఆయన 2006లో రేంజ్ అటవీశాఖ అధికారిగా నాలుగేళ్లపాటు విధులు చేపట్టారు. 2010లో గ్రూప్–1 ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యారు. నిర్మల్ (మహబూబ్‌నగర్), ఆత్మకూరు(కర్నూలు), మంగళగిరి డీజీపీ కార్యాలయ టెక్నికల్ సర్వీసెస్, పోలీస్ అకాడమీలో ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తించారు. 2018లో ఏఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. కర్నూలు జిల్లా పరిపాలన, విజయవాడ సిటీ(ట్రాఫిక్) ఏడీసీపీగా, గవర్నర్ ఇన్ రాజ్‌భవన్ ఏడీసీగా విధులు నిర్వర్తించి, గుంటూరు జిల్లాకు బదిలీపై వచ్చారు. గత నెల 9న నాన్ కేడర్(ఎస్పీ) ఎస్పీ నుంచి ఐపీఎస్ హోదా పొందారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో రేషన్ బియ్యం మాఫియాపై ఉక్కుపాదం మోపారు. అదే విధంగా వంట నూనెలను అధిక ధరలకు విక్రయించే వారిపై కూడా విస్తృత తనిఖీలు నిర్వర్తించారు. దీంతో గతంలో నిర్ణయించిన ధరలకే విక్రయించే విధంగా చర్యలు చేపట్టారు. ఇక ఎరువులు, పురుగు మందులు దుకాణాల్లోనూ తనిఖీలు చేపట్టి, సాధారణ స్థితికి తీసుకువచ్చి రైతులకు అందుబాటులో ఉండేలా చూశారు. అక్రమదారులపై కేసులు నమోదు చేశారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఘన స్వాగతం

- కార్యక్రమానికి హాజరైన ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ప్రజాప్రతినిధులు
- తెనాలి స్టేషన్ వరకు ప్రయాణించిన జిల్లా ఎస్పీ



గుంటూరులో ఆగిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ఎంపీ అయోధ్య రామిరెడ్డి,అధికారులు

లక్ష్మీపురం: వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు శనివారం ఘన స్వాగతం లభించింది. సికింద్రబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే రైలుకు ఈ రోజు పెద్ద స్టేషన్‌లో ఆగేందుకు అవకాశం కల్పించారు. సాయంత్రం 4.05గంటలకు చేరుకుంది. గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ, రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి, ఏడీఆర్ఎం శ్రీనివాస్, సంబంధిత డివిజన్ అధికారులు అంతా రైలులోకి వెళ్లి ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, గుంటూరు తూర్పు, పొన్నూరు ఎమ్మెల్యేలు ముస్తఫా, కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్ సజీల, పలువురు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే 12వ వందేభారత్ రైలు గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా ప్రయాణించడం ఆనందంగా ఉందని చెప్పారు. గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ 9వ తేదీ నుంచి యథావిధిగా సికింద్రబాద్, నల్గొండ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి చేరుకుంటుందని చెప్పారు. గుంటూరు రైల్వే స్టేషన్‌కు చేరుకున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, తెనాలి రైల్వే స్టేషన్ వరకు ప్రయాణించారు. వందేభారత్ రైలులో నల్గొండ కేంద్రీయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు, గుంటూరు రైల్వే స్టేషన్ వరకు ప్రయాణించారు.

సెలవు రోజూ రూ.1.02 కోట్ల పన్ను వసూలు



హెల్ప్ డెస్క్‌లో వివరాలు తెలుసుకుంటున్న ప్రజలు

నెహ్రూనగర్(గుంటూరు): నగర పాలక సంస్థకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థల పన్నులను ఏక మొత్తంలో చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో శనివారం ఒక్కరోజే విశాఖపట్నం రూ.1.43 కోట్లతో మొదట స్థానంలో నిలవగా రూ.1.02 కోట్ల వసూలుతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ నిలిచింది. ఈనెల 5వ తేదీ నుంచి 8 వరకు రూ.2.50 కోట్ల వసూలు అయింది. ఈ నెలాఖరు వరకు పన్ను మొత్తం చెల్లించిన వారికి 5శాతం రాయితీ ఉంటుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నేడు(ఆదివారం) సెలవు రోజు అయినప్పటికీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు క్యాష్ కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిమాండ్ నోటీసు కోసం వేచి చూడకుండా అసెస్మెంట్ నంబర్‌తో నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ లో సంప్రదించి ఏక మొత్తంలో పన్ను చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ సూచించారు.

మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఆర్ మైనార్టీ బాలికల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.రజిని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ, ఎస్టీ బాలికలకు రిజర్వ్ చేసిన సీట్లతో పాటు 6,7,8 తరగతుల్లో మిగిలిన ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ ఖాళీలను భర్తీ చేసేందుకు మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా తరగతుల్లో ప్రవేశానికి ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఈనెల 24లోగా ఆన్‌లైన్‌లో httpr://aprr.apcfrr.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు. అదే విధంగా 5,6,7,8వ తరగతుల్లో ముస్లిం విద్యార్థినులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత ముస్లిం విద్యార్థినులు మే 15 నుంచి ఆన్‌లైన్‌లో ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేకుండా దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు కాపీని పొన్నూరు రోడ్డు, సంగడిగుంటలోని ఏపీఆర్ మైనార్టీ బాలికల పాఠశాలలో సమర్పించి, అడ్మిషన్ పొందాలని సూచించారు. పూర్తి వివరాలకు పాఠశాలతో పాటు 7702774387 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

టెన్త్ ఇంగ్లిష్ పరీక్షకు 99.50 శాతం హాజరు

- పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి
- 81 కేంద్రాల్లో అధికారుల తనిఖీలు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు జిల్లాలో 99.50 శాతం హాజరు నమోదైంది. గుంటూరు జిల్లాలో 138 పరీక్ష కేంద్రాల పరిధిలో కేటాయించిన 26,379 మంది విద్యార్థులకు 26,213 మంది హాజరయ్యారు. స్తంభాలగరువులోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్షలను నిర్వహించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్, గుంటూరు వెస్ట్ తహసీల్దార్ సాంబశివరావు ఉన్నారు. విద్యాశాఖతో పాటు రెవెన్యూ, పోలీసు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 55 పరీక్ష కేంద్రాలతో పాటు ఐదు స్టోరేజీ పాయింట్లను తనిఖీ చేశారు. అదే విధంగా జిల్లాలోని వివిధ మండలాల ఎంఈఓలు మరో 26 పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 40 టీఎంసీలు ఉంది. ఎగువ నుంచి 200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4,000 క్యూసెక్కులు వదులుతున్నారు.

టీడీపీ గుండెల్లో రైళ్లు

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



కొల్లూరులో 'జగనన్నే మా భవిష్యత్తు' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున తదితరులు

కొల్లూరు: రాజకీయ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ చేయని సాహసమే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం అని, దీంతో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చేసిన మోసాలు, అబద్ధపు ఆలోచనలను ప్రజల చెంతకు తీసుకెళ్తుండడంతో టీడీపీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. స్థానిక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన ఇంటింటి సర్వే ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు, నెరవేర్చిన హామీల గురించి ప్రజలకు తెలియజేయడం, టీడీపీ కుట్రలు, కుతంత్రాలను ప్రతి ఒక్కరికి వివరించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంతో ప్రజల సంపూర్ణ మద్దతు వైఎస్సార్ సీపీ వైపే ఉందన్న విషయం తేటతెల్లమవుతుందని అన్నారు. ఓ పక్క ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పనితీరుకు ఆకర్షితులవుతుంటే ఎల్లో మీడియా, చంద్రబాబు ఆందోళనకు గురై విషపూరిత ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి ప్రజా మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో చంద్రబాబును పైకి లేపేందుకు చిట్‌ఫండ్‌ల రూపంలో రూ.వందల కోట్లు అవినీతికి పాల్పడిన ఓ కురువృద్ధుడు సొంత పత్రికను అడ్డుపెట్టుకుని విషం కక్కుతున్నారని విమర్శించారు. ప్రజల అభిమానాన్ని చూరగొంటున్న వైఎస్సార్ సీపీని ఎదుర్కొనే శక్తి లేని టీడీపీ పవన్‌కల్యాణ్‌తో కలసి అధికారం దక్కించుకోవాలన్న కుటిల పన్నాగాలు పన్నుతుందని ధ్వజమెత్తారు. చివరకు టీడీపీ చేతిలో పవన్‌కల్యాణ్ మోసపోయేకంటే ఎన్నికల్లో నిలబడి పోరాడి గెలవాలని సలహా ఇచ్చారు. ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పోరాడుతున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇచ్చి అండగా నిలవాలని కోరారు. ధనవంతుడికి, పేదవారికి రాజ్యాంగం ఇచ్చిన సమానమైన ఓటు హక్కును ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీకి వేయడం ద్వారా చంద్రబాబుకు ప్రజలు తిరిగి బుద్ధి చెప్పాలని కోరారు. తొలుత పార్టీ నాయకులతో కలసి ఆయన ' జగనన్నే మా భవిష్యత్' పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో కొల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, అమృతలూరు ఎంపీపీ రాపర్ల నరేంద్ర, కొల్లూరు, భట్టిప్రోలు వైస్ ఎంపీపీలు మురాల రాంబాబు, కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు బావిరెడ్డి వెంకట్రామయ్య, అమిరిశెట్టి శ్రీధర్, వేమూరు మార్కెట్‌యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్ తూము నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, కమ్మెల సాంబయ్య, కోగంటి లవకుమార్, అయిలా సుబ్బారావు, దున్నా మేరిసుబాబు, ఉప్పు శ్రీనివాసరావు, యలవర్తి సురేష్‌బాబు, పడమట శ్రీనివాసరావు, చిలకా ప్రకాశం, కూచిపూడి మోషే, తోడేటి రత్నాకర్, పాలిమట్ల జోసప్, కనపర్తి మోమన్‌రావు, మాతంగి రత్నకుమార్, బుజ్జి, యడ్ల పెదబాబు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 1316 క్యూసెక్కులు



దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1316 క్యూసెక్కుల విడుదల చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. హై లెవల్ కాలువకు 106 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 60, తూర్పు కెనాల్‌కు 286, పశ్చిమ కెనాల్‌కు 45, కొమ్మమూరు కాలువకు 800 క్యూసెక్కులు విడుదల చేశారు.

క్లుప్తంగా

మంత్రి నాగార్జున ఈస్టర్ శుభాకాంక్షలు



భట్టిప్రోలు: సత్యాన్ని అంతం చేయాలని ప్రయత్నించిన ప్రతి సారీ అది ఏదో ఒక రూపంలో తిరిగి జన్మిస్తూనే ఉంటుంది...అదే ఈస్టర్ మనకు నేర్పే పాఠమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. పాప పరిహారాల నుంచి మానవులను సంరక్షించేందుకు మృతి చెందిన ఏసుక్రీస్తు తిరిగి సజీవంగా లేచాడన్నారు. గుడ్‌ఫ్రైడే రోజున శిలువధారి అయిన ఏసుక్రీస్తు తిరిగి పునరుత్థానుడైన రోజునే ఈస్టర్ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని కలిగి ఉండాలని చెప్పారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే తలంపు కలిగి ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. క్రైస్తవులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో కోచ్‌లు, కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు

మంగళగిరి: ఈనెల 22,23 తేదీల్లో విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ ఆవరణలో జరుగనున్న 10వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ బెంచి ప్రెస్‌మెన్ ఉమెన్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2023 పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. జిల్లా నుంచి తెనాలి, గుంటూరు, పొన్నూరు, మంగళగిరి నుంచి జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో ఎనిమిది మంది ఎంపిక కాగా 12 మంది బాలురు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన జట్టులకు కోచ్‌లు షేక్ సంధానీ, ఎండీ ఖమ్రుద్దీన్, పి.భాస్కర్, జి.సాయి రేవతిలు అభినందించినట్లు తెలిపారు.

సమాజంలో న్యాయవాదులది కీలక పాత్ర

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, చిత్రంలో డొక్కా మాణిక్యవరప్రసాద్, మర్రి రాజశేఖర్

పట్నంబజారు: సమాజంలో న్యాయవాదులది ఎంతో కీలకపాత్ర అని, ముందుచూపు ఉన్న న్యాయవాదులు ప్రజా సంక్షేమమే పరమావధిగా పాటుపడుతుంటారని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చెప్పారు. ఈమేరకు శనివారం బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో 'జగనన్న పాలనలో – న్యాయ సంస్కరణలు' అనే అంశంపై సమావేశం జరిగింది. సమావేశానికి వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పి.డి.భగవాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయవ్యవస్థ పటిష్టతకు ఎంతగానో పాటుపడుతున్నారన్నారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. పదిరోజులపాటు నవోత్సవాలను న్యాయవాదులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ అయినా అనుబంధ విభాగాల పాత్ర ఎంతో కీలకమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పదవులు కేవలం అలంకార ప్రాయం కాకుండా ప్రతి గడపకు జరుగుతున్న సంక్షేమాన్ని వివరించాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు రూ.5వేలు స్టయిఫండ్ ఇవ్వడంతోపాటు, డెత్ బెనిఫిట్స్ కూడా న్యాయ విభాగంతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఆ పదవులకు న్యాయం చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు న్యాయవాదులు పోషించిన పాత్ర అభినందనీయమన్నారు. ప్రభుత్వ ప్లీడరు, పీపీలు, ఏపీపీలు, వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం నేతలు, న్యాయవాదులు పోకల వెంకటేశ్వర్లు, మాధవి, సాగర్, లాయర్ బుజ్జి, వజ్రాల రాజశేఖర రెడ్డి, వట్టికూటి బ్రహ్మారెడ్డి, శిఖా బెనర్జి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు కొత్తా చిన్నపరెడ్డి, గనిక ఝాన్సీ, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

యువకుడిపై సుత్తితో దాడి

పరిస్థితి విషమం..
గుంటూరు వైద్యశాలకు తరలింపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు నాగరాజు

చీరాలటౌన్: తన హోటల్ ముందు నిల్చున్న యువకుడిపై యాజమాని విచక్షణారహితంగా సుత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన ఈపూరుపాలెం రైల్వేస్టేషన్ వద్ద శనివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై పి.జనార్దన్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఈపూరుపాలేనికి చెందిన కొండవీటి నాగరాజు ఉపాధి కోసం చిలకలూరిపేటలో కూలీ పనులు చేసుకుంటూ తల్లి కాళికాంబతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. శనివారం తన అమ్మమ్మ, మేనమామ ఇంటికి వచ్చిన నాగరాజు ఈపూరుపాలెం రైల్వేస్టేషన్ వద్దకు వెళ్లి స్టేషన్ ముందు ఉన్న హోటల్ ముందు నిలుచుని ఉన్నాడు. ఈక్రమంలో అకారణంగా హోటల్ యాజమాని రాజా అతనిపై సుత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో నాగరాజు తలకు తీవ్ర గాయాలు కాగా కంటికి, దంతాలు ఊడి తీవ్ర రక్తస్రావం అయ్యింది. విషయం తెలుసుకున్న క్షతగాత్రుడి బంధువులు రక్తపు మడుగులో ఉన్న నాగరాజును చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స పొందుతున్న నాగరాజును రూరల్ సీఐ మల్లికార్జునరావు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. క్షతగాత్రుడి మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. యువకుడు నాగరాజుపై విచక్షణరహితంగా దాడిచేసిన నిందితుడు హోటల్ రాజా దాడికి ఉపయోగించిన సుత్తితోనే రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై జనార్దన్ ముందు లొంగిపోయాడు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆలయ దుకాణాల వేలం ఆదాయం రూ.1.16 కోట్లు

అద్దంకి: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానం వద్ద వివిధ రకాల దుకాణాల్లో వ్యాపారాలు చేసుకునేందుకు నిర్వహించిన వేలంలో భారీగా ఆదాయం చేకూరింది. 2023–24 సంవత్సరానికి నిర్వహించుకునే హక్కుకు శనివారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు విక్రయించుకునే హక్కును శేగు అవినాశ్ రూ.48.10 లక్షలకు దక్కించుకున్నారు. కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కును యరగొర్ల శ్రీనివాసరావు రూ.13.25 లక్షలకు, పొంగలిశాల నడుపుకునే హక్కును సాధినేని అరుణ రూ.6.20 లక్షలకు, తలనీలాలు పోగు చేసుకునే హక్కును దాసరి వెంకటరాజు రూ.34 లక్షలకు, టీటీడీ కల్యాణ మంటపంలో, పూల అలంకరణ చేసుకునే హక్కు రూ.2.36 లక్షలు, విద్యుత్ డెకరేషన్ చేసుకునే హక్కును, రూ.45వేలు, సప్లయర్స్ సామాను హక్కును రూ.40 వేలకు ఎస్కే మస్తాన్, మొత్తం రూ.1.16కోట్లువచ్చినట్లు తెలిపారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీకి చర్యలు

సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ వి.చంద్రిక



శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గదిని పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష జేడీ చంద్రిక

శావల్యాపురం: జగనన్న విద్యా కానుక కిట్లు పారదర్శకంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ వి.చంద్రిక అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంఈఓ కార్యాలయంలో జగనన్న విద్యాకానుక కిట్లు భద్ర పరుస్తామని, ప్రభుత్వం ఆదేశాల మేరకు నూతన విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్, బెల్ట్‌లు, షూస్, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు తదితర సామగ్రి భద్రపరిచేందుకు అనుకూలమైనదిగా జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎంపిక చేశామని తెలిపారు. వాచ్‌మన్ కూడా ఉండటం చేత ఈ పాఠశాలను ఎంపిక చేశామన్నారు. జూన్ 15 నాటికి జగనన్న విద్యాకానుక కిట్లు ప్రభుత్వం నేరుగా మండల స్థాయిలో సరఫరా చేస్తుందని ఈ పాఠశాల నుంచి మండలంలోని అన్నీ పాఠశాలలకు నేరుగా ఎంఈఓ పర్యవేక్షణలో సరఫరా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు, సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు, ఎలికా శ్రీనివాసరావు, లింగాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతూ పట్టుబడ్డ టీడీపీ నాయకులు

- ఆరుగురు అరెస్ట్.. రూ.40 వేల నగదు స్వాధీనం
- నిందితులందరూ డాక్టర్ అరవింద్ బాబు అనుచరులే

నరసరావుపేటటౌన్: పేకాట ఆడుతూ పలువురు టీడీపీ నాయకులు పోలీసులకు పట్టుబడ్డారు. శుక్రవారం రాత్రి నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని ఓ గృహంలో పేకాట ఆడుతున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.వెంకటేశ్వరరావు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడ్డ వారిలో కడియాల వియ్యంకుడు

పోలీసుల దాడుల్లో పేకాట ఆడుతూ పట్టుబడిన వారిలో టీడీపీ నేత డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు వియ్యంకుడు రామినేని నాగేశ్వరరావు కూడా ఉన్నారు. పేకాట స్థావరాన్ని ములకలూరుకు చెందిన టీడీపీ నేత మద్దికూరి బ్రహ్మయ్య నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బ్రహ్మయ్య, నాగేశ్వరావు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు అనుచరులుగా కొనసాగుతున్నారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైల్వేశాఖకే తలమానికం



రైలులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే కరణం, వెంకటేష్‌లకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న రైల్వే అధికారులు

చీరాలటౌన్: భారతీయ రైల్వేలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రైల్వే శాఖకే తలమానికమని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం సికింద్రాబాద్ నుంచి తిరుపతికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా నూతనంగా ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు చీరాలలో ఎమ్మెల్యే కరణం, వెంకటేష్‌లు స్వాగతం పలికారు. రైలులో ప్రయాణికులకు అందిస్తున్న వసతులను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ నుంచి తిరుపతికి అత్యంత వేగంగా చేరుకునేందుకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉపయోగపడుతుందన్నారు. ప్రయాణికులకు ఆహ్లాదంతోపాటుగా ప్రయాణాన్ని సుఖవంతంగా చేసేందుకు ఏర్పాటు చేసిన రైలు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అనంతరం వారిద్దరు వందేభారత్‌లో చీరాల నుంచి ఒంగోలు వరకు ప్రయాణం చేశారు. వందేభారత్ రైలు ముందు ప్రజలు సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, చీరాల చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ గీత, బుకింగ్ సూపర్‌వైజర్ బేగ్, మున్సిపల్ కౌన్సిలర్లు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.